ఆమె ప్రాతినిధ్యం అంతేనా!

సార్వత్రిక ఎన్నికల్లో మహిళా అభ్యర్థులు అంతంతే

- పురుషులతో పోలిస్తే భారీ తేడా
- 1957- 2019 మధ్య ఎన్నికల్లో 16 రెట్లు పెరిగిన మహిళా అభ్యర్థులు
- అయినా నేటికీ వెయ్యి దాటని సంఖ్య
- పోటీకి అవకాశాలు లేక పార్లమెంట్‌లో ప్రాతినిధ్యమూ అంతంతమాత్రమే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత్.. సార్వత్రిక ఎన్నికల సంగ్రామానికి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మహిళల ప్రాతినిధ్యం అంశం మరోసారి తెరపైకి వచ్చింది. దేశ జనాభాలో దాదాపు 48.5 శాతం ఉన్న అతివలు.. లోక్‌సభలో మాత్రం కేవలం 14 శాతం మాత్రమే ఉన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఈ పరిస్థితి మరింత ఘోరంగా ఉండేది. లోక్‌సభలో మహిళా ఎంపీల సంఖ్య విషయాన్ని అటుంచితే, కనీసం ఎన్నికల్లో పోటీచేసే మహిళల సంఖ్య కూడా అత్యంత తక్కువగా ఉండేది. ఇందుకు రాజకీయ పార్టీలు మహిళలకు పోటీచేసేందుకు అవకాశాలు కల్పించకపోవడం ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అయితే ఏండ్లు గడిచే కొద్దీ ఈ పరిస్థితిలో కొంతమేర మార్పు కనిపించింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల సంఖ్య పెరుగడంతోపాటుగా, లోక్‌సభకు ఎన్నికయ్యే మహిళా ఎంపీల సంఖ్య కూడా పెరుగుతూ వచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం.. 1957తో పోలిస్తే 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి పోటీచేసే మహిళా అభ్యర్థుల సంఖ్య 16 రెట్లు పెరిగింది. ఆ నాడు కేవలం 45 మంది మహిళలు మాత్రమే ఎన్నికల్లో పోటీచేయగా.. ఈ సంఖ్య 2019 ఎన్నికల నాటికి 726కి పెరిగింది. అయితే పురుషులతో పోలిస్తే.. అభ్యర్థిత్వం విషయంలోగానీ, పార్లమెంట్‌లో వారి ప్రాతినిధ్యంలోగానీ భారీ వ్యత్యాసం కనిపిస్తున్నది.

ఏడు దశాబ్దాల్లో 4 నుంచి 14 శాతానికే..

గతంతో పోలిస్తే ఓవైపు లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే మహిళా అభ్యర్థుల సంఖ్య పెరుగడంతోపాటు.. పార్లమెంట్‌లో మహిళా ఎంపీల ప్రాతినిధ్యం కూడా కొంత మేర పెరిగింది. 1957లో లోక్‌సభలో 4.5 శాతం మంది మహిళా ఎంపీలు ఉండగా.. 2019నాటికి ఇది 14.4 శాతానికి పెరిగింది. 1957-2019 మధ్య ఏడు దశాబ్దాల కాలంలో మహిళా అభ్యర్థుల సంఖ్య 16 రెట్లు పెరుగ్గా, పురుష అభ్యర్థులు ఐదు రెట్లు అయ్యారు. అయితే సంఖ్య విషయంలో పురుషులు, మహిళా అభ్యర్థుల మధ్య భారీ వ్యత్యాసం ఉండటానికి మహిళలకు సరైన అవకాశాలు లేకపోవడమే కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. మహిళా అభ్యర్థుల్లో గెలుపు శాతం అధికంగా ఉన్నప్పటికీ, వారికి అధిక స్థానాల్లో పోటీ చేసేందుకు రాజకీయ పార్టీలు అవకాశాలు కల్పించడం లేదని మహిళా హక్కుల కార్యకర్త రంజనా కుమారి అన్నారు. ఒకవేళ సీటు కేటాయించినా.. బలమైన అభ్యర్థులపై పోటీచేయించడమో లేదా అంగ, అర్థ బలం ఉన్నవారికి వ్యతిరేకంగా నిలబెట్టడం వంటివి జరుగుతున్నాయని పేర్కొన్నారు.

మహిళా ప్రాతినిధ్యం అంతంతే..

లోక్‌సభలో మహిళా ఎంపీలు
1957-4.5 శాతం
2019-14.4 శాతం

మొత్తం అభ్యర్థుల్లో మహిళలు
1957-2.9 శాతం
2019-9 శాతం

లోక్‌సభ ఎన్నికలు	మహిళా అభ్యర్థులు	పురుష అభ్యర్థులు
1957	45	1,474
2019	726	7,322

అభ్యర్థుల్లో గెలిచిన వాళ్లు

సంవత్సరం	మహిళలు	పురుషులు
1957	48.88%	31.7%
2019	10.74%	6.4%

ఈసారి ఎన్నికల్లోనూ అదే పరిస్థితి

2024 లోక్‌సభ ఎన్నికల విషయంలోనూ పెద్ద తేడా కనిపించడం లేదు. యూపీలో జరిగే మొదటి దశ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తున్న 80 మంది అభ్యర్థుల్లో మహిళలు కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. 2019లో మొదటి దశ లోక్‌సభ ఎన్నికల్లో 91 మంది పోటీదారుల్లో మహిళా అభ్యర్థులు 12 మంది. అయితే ఈ పన్నెండు మందిలో తొమ్మిది మంది విజయం సాధించడం గమనార్హం. కాగా, కేంద్రంలోని అధికార బీజేపీ ఇప్పటి వరకు 417 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. వారిలో మహిళలు కేవలం 68 మంది (16 శాతం) మాత్రమే ఉన్నారు.

ఎన్నికల ముందు ఎందరిని జైల్లో వేస్తారు?

- తమిళ నాడు ప్రభుత్వానికి సుప్రీం ప్రశ్న
- ముఖ్యమంత్రి స్టాలిన్‌ను విమర్శించిన యూట్యూబర్‌కు బెయిల్ పునరుద్ధరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: తమిళనాడు సీఎం స్టాలిన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ బెయిల్‌ను సుప్రీంకోర్టు పునరుద్ధరించింది. సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు చేసేవారందరినీ జైల్లో వేస్తారా అని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది. యూట్యూబర్ దురైమురుగన్ సత్తై తనకు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేశాడనడానికి ఎలాంటి ఆధారాలు లేవని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీని ఉద్దేశించి 'ఇలా ఎన్నికల ముందు ప్రతి ఒక్కరినీ కటకటాల వెనక్కి నెడితే.. ఎంత మంది జైల్లో ఉంటారో ఊహించుకోండి' అని జస్టిస్ ఓకా వ్యాఖ్యానించారు. బెయిల్ మీద ఉన్నప్పుడు సత్తై నిందాపూర్వక విమర్శలు చేయకుండా ఉండేలా చూడాలన్న విజ్ఞప్తినీ కోర్టు తిరస్కరించింది. ఏ ప్రకటన నిందాపూర్వకమైనది, కానిది ఎవరు నిర్ణయిస్తారని రోహత్గీని జస్టిస్ ఓకా ప్రశ్నించారు. తనకు మంజూరైన బెయిల్‌ను మద్రాస్ హైకోర్టు రద్దు చేయడంతో సత్తై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన గత రెండున్నరేండ్ల నుంచి బెయిల్‌పై ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల మొదటి దశ పోలింగ్ జరగడానికి కొన్ని రోజుల ముందు సర్వోన్నత న్యాయస్థానం ఈ తీర్పును ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సగం టికెట్లు నేర చరితులకే!

తొలి దశలో 28% కోటీశ్వరులు

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల తొలి దశలో దాదాపు సగం స్థానాల్లో నేర చరితులే ఎక్కువగా పోటీ పడుతున్నారని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ విశ్లేషించింది. మొత్తం 102 స్థానాలకు గాను 42 సీట్లలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది నేర చరితులు ప్రధాన పార్టీల తరపున ఎన్నికల బరిలో నిలిచారని తెలిపింది. 1618 మంది ఎన్నికల అఫిడవిట్లను ఏడీఆర్ పరిశీలించింది. అందులో 252 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని.. వారిలో 161 మందిపై తీవ్రమైన నేరాభియోగాలున్నాయని వెల్లడించింది. 35 మందిపై విద్వేష ప్రసంగాల కేసులున్నాయని తెలిపింది. 41 శాతం సీట్లలో రెడ్ అలర్ట్ ప్రకటించారని చెప్పింది. 28 శాతం అభ్యర్థులు కోటీశ్వరులని ప్రకటించింది. ఆర్జేడీ, డీఎంకే, ఎస్పీ, టీఎంసీ అభ్యర్థుల్లో 40 శాతం మంది ఏదో ఒక నేరానికి పాల్పడిన వారేనని తెలిపింది.

హర్యానాలో బీజేపీకి బీరేంద్ర సింగ్ షాక్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల తరుణంలో బీజేపీకి కేంద్ర మాజీ మంత్రి, హర్యానా నేత బీరేంద్ర సింగ్ (78) షాక్ ఇచ్చారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ, తాను, తన సతీమణి, మాజీ ఎమ్మెల్యే ప్రేమలత సింగ్ బీజేపీకి రాజీనామా చేసినట్టు తెలిపారు. తాము మంగళవారం కాంగ్రెస్‌లో చేరబోతున్నామని చెప్పారు. తాను ఇచ్చిన సలహాలను బీజేపీ పెద్దలు పట్టించుకోలేదన్నారు. జేజేపీతో సంబంధాలను తెంచుకోవాలని కొన్ని నెలల క్రితం సలహా ఇచ్చానని, దానిని కూడా పార్టీ పెద్దలు పెడచెవిన పెట్టారని అన్నారు. సుమారు ఓ నెల క్రితం వీరి కుమారుడు బ్రిజేంద్ర కాంగ్రెస్‌లో చేరారు. బీరేంద్ర సోమవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడాతో సమావేశమయ్యారు.

4 కోట్లతో బీజేపీ నేతల అరెస్ట్!

- తమిళ నాడులో పట్టుకున్న ఎన్నికల సంఘం అధికారులు
- బీజేపీ అభ్యర్థి నాగేంద్రన్ మద్దతుదారులుగా సమాచారం

చెన్నై: లోక్‌సభ ఎన్నికల ముంగిట తమిళనాడులో పెద్ద ఎత్తున నగదు పట్టుబడింది. బీజేపీ తిరునల్వేలి లోక్‌సభ అభ్యర్థి నాయనార్ నాగేంద్రన్ మద్దతుదారులుగా భావిస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి ఎన్నికల అధికారులు రూ.4 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎగ్మోర్ నుంచి తిరునల్వేలి వెళ్తుండగా తాంబరం వద్ద తనిఖీ చేయడంతో ఈ నగదు పట్టుబడిందని అధికారులు తెలిపారు. నగదుకు సంబంధించి వీరి వద్ద సరైన పత్రాలు లేవని పేర్కొన్నారు. బీజేపీ మద్దతుదారుల వద్ద పెద్ద ఎత్తున నగదు పట్టుబడటంపై అధికార డీఎంకే స్పందించింది. నాగేంద్రన్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల ప్రధానాధికారిని కోరింది. ఓటర్లకు పంపిణీ చేయడం కోసమే వీరు ఈ సొమ్మును తీసుకెళ్తున్నారని ఆరోపించింది. నాగేంద్రన్ మాట్లాడుతూ, ఈ నగదుతో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

మోదీపై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ సోమవారం ఎన్నికల కమిషన్ (ఈసీ)కి ఫిర్యాదు చేసింది. లోక్ సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ మేనిఫెస్టోను ముస్లిం లీగ్ మేనిఫెస్టోతో పోల్చుతూ మోదీ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలల్లో మోదీ బొమ్మలు, భారీ కటౌట్లను తొలగించాలని డిమాండ్ చేసింది. పార్లమెంటు ఎన్నికల్లో పోరాడేందుకు అన్ని పార్టీలకు సమాన అవకాశాలు లభించేలా చూడాలని కోరింది.

కాంగ్రెస్ 3.. ఎన్‌సీ 3

జమ్ముకశ్మీర్‌లో సీట్ల పంపకం ఖరారు

శ్రీనగర్, ఏప్రిల్ 8: జమ్ముకశ్మీర్, లఢక్‌లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) పార్టీల మధ్య సీట్ల పంపకం ఖరారైంది. ఈ మేరకు సోమవారం రెండు పార్టీల నేతలు సంయుక్త ప్రకటన చేశారు. అనంత్‌నాగ్, శ్రీనగర్, బారాముల్లా లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్‌సీ పోటీ చేయనుండగా.. ఉదంపూర్, జమ్ము, లఢక్ స్థానాల్లో కాంగ్రెస్ బరిలోకి దిగనున్నది. అయితే విపక్ష ఇండియా కూటమిలో భాగంగా ఉన్న మరో పార్టీ పీడీపీ వేరుగా పోటీ చేస్తున్నది.

మాల్దీవుల మాజీ మంత్రి.. మళ్లీ అదే తీరు!

భారత జెండాను అగౌరవపరుస్తూ పోస్ట్

న్యూఢిల్లీ: మాల్దీవులు మాజీ మంత్రి భారత జెండాను అవమానిస్తూ సోషల్ మీడియాలో సందేశాన్ని పోస్ట్ చేయటం వివాదాస్పదంగా మారింది. భారత్-మాల్దీవుల మధ్య సంబంధాలు ఉద్రిక్తంగా మారగా, దీనికి ఆజ్యం పోసేలా మాజీ మంత్రి మరియం షియునా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తమవుతున్నది. తన దేశంలోని విపక్ష మాల్దీవియన్ డెమొక్రాటిక్ పార్టీని విమర్శిస్తూ ఆమె తాజాగా పోస్టు చేశారు. ఆ పార్టీ పోస్టర్‌లో మన జాతీయ జెండాలోని అశోక చక్రాన్ని ఉపయోగించటం విమర్శలకు దారితీసింది. దాంతో ఆమె 'ఎక్స్'లో క్షమాపణలు చెప్పారు. 'ఇటీవల పంపిన పోస్ట్‌పై చింతిస్తున్నాను. అందుకు క్షమాపణలు చెబుతున్నాను. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా అప్రమత్తంగా ఉంటా'నని వివరణ ఇచ్చుకున్నారు.

రాహుల్ సభ బ్యానర్‌పై బీజేపీ మంత్రి ఫొటో

భోపాల్, ఏప్రిల్ 8: మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం నిర్వహించ తలపెట్టిన ఎన్నికల ర్యాలీ సందర్భంగా సభ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన బ్యానర్‌పై కేంద్ర మంత్రి, బీజేపీ అభ్యర్థి ఫగ్గన్ సింగ్ కులస్తే ఫొటో కనిపించడం సంచలనంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మండ్ల లోక్‌సభ పరిధిలోని ధనోరాలో కాంగ్రెస్ సభ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా బ్యానర్‌పై బీజేపీ నేత ఫొటో ఉండటంపై కంగుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు.. ఫగ్గన్ సింగ్ ఫొటోపై వెంటనే కియోలరి కాంగ్రెస్ ఎమ్మెల్యే హర్వాన్ష్ సింగ్ ఫొటోను అతికించారు. కాగా, దీనిపై మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ స్పందిస్తూ.. బీజేపీ అభ్యర్థి ఫొటోను తమ బ్యానర్‌పై పెట్టడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తమ ఓటమిని అంగీకరించిందని అన్నారు. అయితే మానవ తప్పిదం కారణంగా బ్యానర్‌లో ఫొటో మారిందని కాంగ్రెస్ నేత కేకే మిశ్రా వివరణ ఇచ్చారు.

మోదీపై హేమాంగి సఖి పోటీ

ప్రపంచంలోనే తొలి ట్రాన్స్‌జెండర్ భగవద్గీత కథకురాలిగా గుర్తింపు

వారణాసి, ఏప్రిల్ 8: లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి ప్రధాన మంత్రి నరేంద్రమోదీపై ప్రముఖ ట్రాన్స్‌జెండర్, శ్రీకృష్ణుడి పరమ భక్తురాలు మహామండలేశ్వర్ హేమాంగి సఖి మా పోటీ చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో 20 లోక్‌సభ స్థానాలకు పోటీ చేయబోతున్న అఖిల భారత హిందూ మహాసభ (ఏబీహెచ్‌ఎం) వారణాసి నియోజకవర్గంలో మోదీపై ఆమెను తమ అభ్యర్థిగా నిలబెట్టింది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ రాయ్ మరోసారి పోటీ చేస్తున్నారు. తొలి విడత ఎన్నికల్లో భాగంగా వారణాసిలో జూన్ 1న పోలింగ్ జరుగనున్నది.

హేమాంగి సఖి నేపథ్యం ఇదీ..

భగవద్గీతను ప్రపంచంలో అనర్గళంగా బోధించగలిగే తొలి ట్రాన్స్‌జెండర్ కథకురాలిగా ఖ్యాతి పొందిన హేమాంగి సఖి గుజరాత్‌లోని బరోడాలో జన్మించారు. ఆమె తండ్రి ఓ ఫిలిం డిస్ట్రిబ్యూటర్ కావడంతో కుటుంబం ముంబైకి వలస పోయింది.

కేంద్రమంత్రిని ఢీ కొంటున్న స్వామీజీ

బెంగళూరు, ఏప్రిల్ 8: బీజేపీ నేత, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిపై ఈసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు ప్రముఖ లింగాయత్ స్వామీజీ, శిరహటి ఫక్కీరేశ్వర మఠానికి చెందిన ఫకీర దింగాళేశ్వర స్వామి సోమవారం ప్రకటించారు. లింగాయత్ మఠాలను మంత్రి దుర్వినియోగం చేశారని, వారిని అగౌరవపరిచారని స్వామీజీ ఆరోపించారు. అందుకే తాను స్వయంగా ఎన్నికల బరిలో దిగుతున్నట్టు ప్రకటించారు. ప్రహ్లాద్ జోషిపై ధార్వాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నట్టు తెలిపారు. వీరశైవ, లింగాయత్ వర్గాలను ప్రహ్లాద్ జోషి అణచివేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయ పార్టీలు ధార్వాడ్ నియోజకవర్గ ప్రజలకు ద్రోహం చేశాయన్నారు. ధర్మంలో రాజకీయాలుండకూడదని, కానీ రాజకీయాల్లో ధర్మం ఉండాలన్నారు. ధార్వాడ్ నియోజకవర్గంలో లింగాయత్‌ల ఓట్లు అధికం కాగా.. బ్రాహ్మణులకు చెందిన ప్రహ్లాద్ జోషి అక్కడి నుండి నాలుగుమార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. మే 7న జరిగే రెండో దశలో ధార్వాడ్ పోలింగ్ జరుగనున్నది.

మోదీ గ్యారెంటీ అంటే జైల్లో వేయడమా?

- విపక్ష నేతలను భయపెట్టేందుకే దర్యాప్తు పేరిట దాడులు
- నేను బీజేపీ నేతలను జైల్లో వేస్తానంటే ఎలా ఉంటుంది?
- పార్లమెంట్‌ను జైలుగా మార్చినా భయపడం: మమత
- ఈసీ ఆఫీసు ముందు ధర్నా చేసిన టీఎంసీ నేతల అరెస్ట్
- 2022 పేలుళ్ల కేసులో ముగ్గురు టీఎంసీ నేతలకు సమన్లు

టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రియన్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

కోల్‌కతా, ఢిల్లీ, ఏప్రిల్ 8: జూన్ 4 తర్వాత అవినీతిపై చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ చెప్పడానికి అర్థం విపక్ష నేతలందరినీ లోక్‌సభ ఎన్నికల తర్వాత జైల్లో వేయడమేనా అని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ ప్రశ్నించారు. బంకురా జిల్లాలో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగించారు. 'ఒక ప్రధాని ఇలాగేనా మాట్లాడేది? ఎన్నికల తర్వాత బీజేపీ నేతలను జైల్లో వేస్తానని నేనంటే ఎలా ఉంటుంది? ప్రజాస్వామ్యంలో ఇది ఆమోదయోగ్యం కాదు కాబట్టి నేను అలా అనను' అని ఆమె అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత విపక్ష నేతలను జైల్లో వేయడమే మోదీ గ్యారంటీ అని ఆమె ఆరోపించారు. ఎన్నికల తర్వాత పార్లమెంట్ భవనం మొత్తాన్ని జైలుగా మార్చినా భయపడేది లేదని ఆమె స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం కారణంగా ఇప్పటికే దేశమంతా వర్చువల్ కారాగారంగా మారిందని ఆమె ఆరోపించారు.

ఎన్ఐఏ చీఫ్ నియామకానికి ఈసీ అనుమతి తీసుకున్నారా?

సీబీఐ, ఎన్ఐఏ, ఈడీ, ఐటీ విభాగాల అధిపతులను మార్చాలని సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన తృణమూల్ కాంగ్రెస్ నాయకులను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు ఆదేశాల మేరకు దర్యాప్తు సంస్థలు విపక్ష నేతలను వేధిస్తున్నాయని టీఎంసీ నాయకులు ఎన్నికల కమిషనర్లను కలిసిన అనంతరం ఆరోపించారు. ఇదే విషయమై టీఎంసీ ఎంపీ సాకేత్ గోఖలే ఎక్స్‌లో విమర్శనాస్త్రాలు సంధించారు. బీజేపీ నేత జితేంద్ర తివారీ ఎన్ఐఏ ఎస్పీ డీఆర్ సింగ్‌ను మార్చి 26న కలిశారని.. అదే రోజు సదానంద్ ఎన్ఐఏ కొత్త చీఫ్‌గా నియమితులయ్యారని తెలిపారు. తివారీ ఒక ప్యాకెట్‌తో పాటు ఎన్ఐఏ లక్ష్యంగా చేసుకోవాల్సిన టీఎంసీ నేతలు, కార్యకర్తల జాబితాను డీఆర్ సింగ్‌కు అందించారని సాకేత్ ఆరోపించారు. 'బీజేపీ పాలిత రాష్ట్రంలోని అధికారిని ఎన్ఐఏ అధిపతిగా ఎన్నికల సమయంలో నియమించారు. దీనికి మోదీ ప్రభుత్వం ఈసీ అనుమతి తీసుకుందా?' అని ఆయన ప్రశ్నించారు.

విచారణకు సహకరించడం లేదు

2022 భూపతినగర్ పేలుళ్ల కేసులో సోమవారం విచారణకు రావాలని కోరుతూ జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ) ముగ్గురు తృణమూల్ కాంగ్రెస్ నాయకులకు సమన్లు జారీ చేసింది. అయితే సదరు నాయకులు విచారణకు హాజరు కాలేదు. ఇప్పటికే అరెస్టయిన ఇద్దరు టీఎంసీ నాయకులు విచారణకు సహకరించడం లేదని ఎన్ఐఎ అధికారి ఒకరు తెలిపారు.

ఎన్నార్సీ అమలుచేస్తే దేశాన్ని తగలబెడతాం

కేంద్రమంత్రి శాంతనూ ఠాకూర్‌కు లష్కరే తాయిబా బెదిరింపు లేఖ

కోల్‌కతా: కేంద్ర మంత్రి శాంతను ఠాకూర్‌కు లష్కరే తాయిబా నుంచి బెదిరింపు లేఖ వచ్చింది. ఎన్నార్సీని అమలుచేస్తే దేశం మొత్తాన్ని తగలబెడతామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టబోమని అందులో హెచ్చరించారు. బెంగాలీ భాషలో రాసిన లేఖలో జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ) అమలు తర్వాత ముస్లింలు హింసకు గురైనట్టయితే, మతువా కమ్యూనిటీ పవిత్ర స్థలమైన ఠాకూర్‌బారీని కూల్చేస్తామని బెదిరించారు. లేఖను చూసి షాక్ అయ్యానన్న మంత్రి వెంటనే తన శాఖకు సమాచారమిచ్చానన్నారు.

శాంతను ఠాకూర్‌పై ఎఫ్ఐఆర్

శాంతను ఠాకూర్‌పై పశ్చిమ బెంగాల్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. స్వయంగా ఆయన అత్త, టీఎంసీ ఎంపీ అయిన మమతా బాలా ఠాకూర్ ఈ ఫిర్యాదు చేశారు. బోరోమా అని ముద్దుగా పిలుచుకునే కమ్యూనిటీ మెట్రియార్క్ బినాపాని దేవి ఐదేళ్ల క్రితం చనిపోయారు. ఆమె చనిపోయే వరకు నివసించిన ఇంటిని బలవంతంగా స్వాధీనం చేసుకోవటానికి యత్నించారన్నది అభియోగం. అయితే ఇదంతా నిరాధారమని మంత్రి కొట్టిపారేశారు.

కేజ్రీవాల్ అరెస్టుపై ఢిల్లీ హైకోర్టు తీర్పు నేడు

ఈడీ ఆఫీసుకు వస్తున్న ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: మద్యం పాలసీ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించనున్నది. తన అరెస్టు, ఆ తర్వాత జ్యుడీషియల్ రిమాండ్ విధించటాన్ని కేజ్రీవాల్ సవాల్ చేశారు. అరెస్టు చేసిన సమయాన్ని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు విరుద్ధంగా తన అరెస్టు ఉందని కేజ్రీవాల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

కేజ్రీవాల్ పీఏ, ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్‌ను ప్రశ్నించిన ఈడీ

మద్యం పాలసీ కేసులో సీఎం కేజ్రీవాల్ పీఏ బీభవ్ కుమార్, ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్‌లను ఈడీ సోమవారం ప్రశ్నించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద వారిద్దరి నుంచి వాంగ్మూలం నమోదుచేసినట్టు ఈడీ తెలిపింది.

ఆప్ మంత్రులపై ఢిల్లీ ఎల్‌జీ ఆగ్రహం

ఢిల్లీ మంత్రులపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలన పట్ల శ్రద్ధ చూపడం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసిన నేపథ్యంలో మంత్రిత్వ శాఖల రోజువారీ కార్యకలాపాలపై చర్చించేందుకు తాను ఆహ్వానించినప్పటికీ వీరు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని సాకుగా చూపించి, ఈ మంత్రులు తాను నిర్వహించాలనుకున్న సమావేశాలకు హాజరుకావడం లేదని తెలిపారు. ఈ మేరకు ఎల్‌జీ సచివాలయం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ఓ లేఖను రాసింది.

కేజ్రీవాల్ బీజేపీలో చేరితే ఒక్కరోజులో బయటకొస్తారు: ఆతిశీ

కేజ్రీవాల్ గనుక బీజేపీలో చేరితే, ఆయన ఒక్కరోజులో జైలు నుంచి విడుదల అవుతారని ఢిల్లీ మంత్రి, ఆప్ నేత ఆతిశీ అన్నారు. అస్సాంలో డిబ్రూగఢ్‌లో సోమవారం ఆప్ అభ్యర్థి తరపున ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కేజ్రీవాల్ ఎప్పటికీ తలవంచబోరని, దేశంలోని సాధారణ ప్రజల హక్కుల కోసం తన పోరాటం కొనసాగిస్తారని ఆతిశీ స్పష్టం చేశారు. ప్రస్తుత అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ మాదిరిగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కూడా బీజేపీలో చేరితే.. కేజ్రీవాల్ కేవలం ఒక్క రోజులో బయటకు వస్తారని అన్నారు.

17 మంది మనుమలు, మనుమరాళ్లకు ఒకేసారి పెండ్లి!

న్యూఢిల్లీ: ఒకరికి పెండ్లి చేయడానికి సంబంధాన్ని చూడటమే కష్టంగా మారిన ఈ రోజుల్లో, రాజస్థాన్‌కు చెందిన సూర్జారామ్ గోదారా ఏకంగా 17 మందికి ఒకేసారి వివాహాలు జరిపించారు. వీరందరి వివాహాలకు ఒకే శుభలేఖను ముద్రించి, బంధుమిత్రులను ఆహ్వానించారు. ఐదుగురు మనుమలకు ఏప్రిల్ 1న, 12 మంది మనుమరాళ్లకు ఆ మర్నాడు పెళ్లిళ్లు చేశారు. బికనీర్ జిల్లా, నోఖా మండలం, లాల్‌మదేసర్ గ్రామంలో, ఒకే ఇంట్లో ఇలా సామూహిక వివాహాలు జరగడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు.

స్మోక్ చేస్తున్న యువతులను చూసిన యువకుడి హత్య

నాగ్‌పూర్ : మహారాష్ట్రలోని నాగ్‌పూర్, మహాలక్ష్మీ నగర్ ప్రాంతంలో శనివారం దారుణం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఓ పాన్ షాపు వద్ద శనివారం రాత్రి ఇద్దరు యువతులు జయశ్రీ, సవిత సిగరెట్లు కాల్చుతున్నారు. ఆ సమయంలో సిగరెట్లు కొనేందుకు అక్కడికి వచ్చిన రంజిత్ రాథోడ్ (28) ఆ యువతులవైపు గుడ్లప్పగించి చూశాడు. దీంతో ముగ్గురి మధ్య గొడవ జరిగింది. రాథోడ్ వీడియో చిత్రీకరించారు. రాథోడ్‌ను దూషిస్తూ, ఆయనపైకి జయశ్రీ పొగ వదులుతున్నట్లు ఆ వీడియోలో కనిపించింది. ఇంతలో ఈ యువతుల్లో ఒకరు తన మిత్రుడు ఆకాశ్‌కు ఫోన్ చేసి, తక్షణమే రావాలని చెప్పింది. వెంటనే ఆకాశ్ మరికొందరితో కలిసి అక్కడికి వచ్చారు. రాథోడ్‌ను కత్తితో అనేకసార్లు పొడిచారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, రాథోడ్‌ను దవాఖానకు తరలించారు. చికిత్స జరుగుతుండగా ఆయన మరణించారు. జయశ్రీ, సవిత, ఆకాశ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌ను స్వాధీనం చేసుకున్నారు.



45% ఐఐటీ మద్రాస్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు లేవ్!

చెన్నై, ఏప్రిల్ 8: ఐఐటీలు అంటేనే ఉద్యోగం గ్యారంటీ అన్న భరోసా. కానీ, ఐఐటీ మద్రాస్‌లో 45 శాతం మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు దక్కలేదట. ధీరజ్ సింగ్ అనే వ్యక్తి ఆర్టీఐ దరఖాస్తు పెట్టుకోగా, ఈ విషయాలు వెల్లడయ్యాయి. అయితే విద్యార్థుల ప్లేస్‌మెంట్లపై ఐఐటీ మద్రాస్ యాజమాన్యం స్పందించింది. ప్లేస్‌మెంట్లు ఇంకా కొనసాగుతున్నాయని, 2024 జూలై వరకు పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుందని వెల్లడించింది. 45 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు రాలేదడాన్ని ఖండించింది. ప్లేస్‌మెంట్లు ఇంకా కొనసాగుతున్నందున.. ఎలా ఉద్యోగాలు రాలేదని వ్యాఖ్యానిస్తారని మండిపడింది. స్నాతకోత్సవం అనంతరం ప్లేస్‌మెంట్లపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నది.

వినీలాకాశంలో అద్భుతం



ఆకాశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. సంపూర్ణ సూర్యగ్రహణం కనువిందు చేసింది. అమెరికా, కెనడా, మెక్సికోతోపాటు ఉత్తరఅమెరికాలోని పలు ప్రాంతాల్లో ఈ సంపూర్ణ సూర్యగ్రహణం దర్శనమిచ్చింది. మెక్సికోలో సోమవారం ఉదయం 11.07 గంటలకు, టెక్సాస్‌లో మధ్యాహ్నం 1.27కు గ్రహణం ఏర్పడింది. గ్రహణాన్ని వీక్షించడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో ఆసక్తి కనబర్చారు. ఆన్‌లైన్‌లో నాసా ప్రత్యక్ష ప్రసారం చేసింది. దాదాపు 50 ఏండ్ల తర్వాత, సుదీర్ఘంగా సాగిన సూర్యగ్రహణం ఇదే. సుమారు 4.27 నిమిషాలపాటు గ్రహణం కొనసాగుతుందని శాస్త్రవేత్తలు అంచనావేశారు. భారత్‌లో గ్రహణం కనిపించదని పేర్కొన్నారు.

కేంద్రం, రాష్ట్రాల మధ్య జగడాలొద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక సూచన చేసింది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకోవాలని, జగడాలు వద్దని సూచించింది. కరువు సహాయ నిధులు విడుదల చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ కర్ణాటక సర్కారు దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

మొజాంబిక్ తీరంలో పడవ మునక.. 94 మంది మృతి

న్యూఢిల్లీ: మొజాంబిక్ ఉత్తర కోస్తాలో ఓ పడవ మునిగిపోవడంతో దాదాపు 94 మంది ప్రాణాలు కోల్పోయారు. నంపుల ప్రావిన్స్ దీవికి సమీపిస్తుండగా ప్రమాదం జరిగిందని, ఈ పడవలో సుమారు 130 మంది ప్రయాణికులు ఉన్నారని అధికారులు తెలిపారు. పడవ సామర్థ్యానికి మించి ప్రయాణికులు ప్రయాణిస్తుండటమే ఈ ప్రమాదానికి కారణమని నంపుల స్టేట్ సెక్రటరీ జైమే నెటో చెప్పారు.

న్యూజిలాండ్ వీసా నిబంధనలు మరింత కఠినం

వెల్లింగ్టన్: ఉపాధి కోసం న్యూజిలాండ్ బాట పట్టే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. గత ఏడాది న్యూజిలాండ్‌కు రికార్డు స్థాయిలో వలసలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఉపాధి వీసా నిబంధనల్లో మార్పులు తేవాలని ఆ దేశ ప్రభుత్వం నిర్ణయించింది. నైపుణ్యం కల సెకండరీ టీచర్లను ఆకర్షించడం కోసం కూడా న్యూజిలాండ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఇమ్మిగ్రేషన్ మంత్రి ఎరికా స్టాన్‌ఫోర్డ్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే సమయంలో నైపుణ్యాల కొరత లేని ఉద్యోగాల కోసం న్యూజిలాండ్ ప్రజలు ముందు వరుసలో ఉండేలా చూసుకోవాలని ఆమె పేర్కొన్నారు. గత సంవత్సరం సుమారు లక్షా 73 వేల మంది ప్రజలు న్యూజిలాండ్‌కు వలస వచ్చారని ఆమె వెల్లడించారు. న్యూజిలాండ్ జనాభా సుమారు 5.1 మిలియన్లు. కాగా కరోనా అనంతరం ఈ దేశానికి వలసలు బాగా పెరిగాయి.